### ఎపిఎస్పిడిసిఎల్ డిస్ట్రిక్ట్ స్టోర్స్
## ఎఈ, డిప్యూటీ ఈఈల సస్పెన్షన్

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ఎపిఎస్పిడిసిఎల్ పరిధిలో, గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న బి. మల్లికార్జున, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహిస్తున్న పి.శంకరయ్యలను సస్పెండ్ చేస్తూ ఎపిఎస్పిడిసిఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివ శంకర్ లోతేటి ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆ సంస్థ డైరెక్టర్ (టెక్నికల్ అండ్ హెచ్‌ఆర్ డి) కె. గురవయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గూడూరు డిస్ట్రిక్ట్ స్టోర్స్‌లో విద్యుత్ పరికరాలకు సంబంధించి అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో వారిని విధుల నుంచి సస్పెండ్ చేస్తూ ఉత్వర్వులు జారీ చేశారని, అదేవిధంగా ఈ అంశంపై వివరణ కోరుతూ నెల్లూరు సర్కిల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/టెక్నికల్‌గా విధులు నిర్వహిస్తున్న ఎస్. బాలచంద్రకు షోకాజ్ నోటీసును జారీ చేసినట్లు ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# ప్రభుత్వ సంస్థలను కాపాడుకుందాం

➤ పాలకుల పాలసీ ప్రైవేటీకరణే ➤ ఐక్య ఉద్యమాలతో పోరాడుదాం ➤ ఆర్టీసీ ఎస్‌డబ్ల్యూఎఫ్ మహాసభల్లో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** కేంద్ర, రాష్ట్ర పాలకుల పాలసీ ప్రభుత్వ సంస్థల ప్రైవేటీకరణేనని, ఐక్య ఉద్యమాలతో దానిని అడ్డుకొని ప్రభుత్వ సంస్థలను కాపాడుకుందామని పలువురు వక్తలు ఏపీఎస్‌ఆర్టీసీ ఎస్డబ్ల్యూఎఫ్ 13వ మహాసభల సందర్భంగా పిలుపు నిచ్చారు. తిరుపతి యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం, నేపాల్ దేవ్ భట్టాచార్య నగర్, ఆర్ కోటేశ్వరరావు ప్రాంగణంలో ఏపీపీటీడీ(ఆర్‌టీసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర 13వ మహా సభలు గురువారం ప్రారంభమయ్యాయి. ఎస్డబ్ల్యూ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య అధ్యక్ష తన జరిగిన కార్యక్రమానికి ఏఐఆర్టీడబ్ల్యుఎఫ్ ప్రధాన కార్యదర్శి జి.బాను కృష్ణషాలో ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లు అమలు సీఐటీయూ ప్రతిఘటనతోనే ఆలస్యమవుతున్నాయని తెలిపారు. దేశాన్ని నిత్యం విద్వేషాలతో రెచ్చగొడుతున్న నరేంద్ర మోడీ కంటే మించినవాడు ఎవరూ లేరని, విష ప్రచారాన్ని ప్రజలకు ఎక్కిస్తున్నారని ఆరోపించారు. ఎంఐ అబెట్‌మెంట్ యాక్ట్‌ను తొలగించి ఆర్టీసీ భద్రతను ప్రశ్నార్థకంగా చేశారన్నారు. సిబ్బందిపై తీవ్రమైన పనిష్మెంట్‌ల ద్వారా ఆర్టీసీని నిర్వీర్యం చేస్తున్నారు. రాజ్యాంగ విధ్వంసం, బిఎన్ఎస్, ఎంఐ అంబెక్టుమెంట్ విధానాల ద్వారా ఆర్టీసీని మూసి వేసే పరిస్థితి పాలకులు తీసుకొస్తున్నారన్నారు. దేశవ్యాప్తంగా కేవలం ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ, కేరళ వంటి దక్షిణాది రాష్ట్రాల్లో మాత్రమే ప్రభుత్వా రవాణా సంస్థ ఆర్టీసీ బలంగా ఉందన్నారు. మిగతా ప్రాంతాల్లో వాటిని నిర్వీర్యం చేశారని గుర్తు చేశారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం రవాణా రంగంలో బహుళ జాతి కంపెనీలను ప్రవేశపెట్టి అభివృద్ధి పేరుతో ధ్వంసం చేస్తోందని విమర్శించారు. పొల్యూషన్ కంట్రోల్ పేరుతో ఎలక్ట్రికల్ బస్సులను తీసుకువచ్చిన కేంద్రం, వాటిని ప్రభుత్వ సంస్థలకు అప్పగించకుండా.. రూ. 20 వేల కోట్లు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి, బస్సులు కూడా అప్పగించడం శోచనీయమన్నారు. ఆర్టీసీ సంస్థకు టోల్ టాక్స్ మరో ప్రమాదంగా మారిందని, ఏపీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసినప్పటికీ సమస్యల పరిష్కారం మాత్రం ఎక్కడేసిన గొంగళి అక్కడే అన్ని చందాగా మారిందని విమర్శించారు. ఇటీవల కాలంలో రెగ్యులర్ రిక్రూట్మెంట్లు కనుమరుగయ్యాయని, అసంఘటిత కార్మికుల సంఖ్య పెరిగిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పొరేటర్ వ్యక్తులతో కుమ్మక్కై చంపేస్తున్నాయని, ఇలాంటి తరుణంలో ఆర్టీసీని రక్షించుకోవడం మన బాధ్యత అన్నారు. ప్రభుత్వ రవాణా సంస్థను కాపాడుకునేందుకు సెప్టెంబర్ 12వ తేదీన దేశవ్యాప్తంగా నిరసన చేశామని, మరోసారి నవంబర్ 23వ తేదీన జాతీయ కన్వెన్షన్ నిర్వహిస్తున్నామని, ఇందులో భవిష్యత్తు ప్రణాళికపై చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. ఆంగ్లంలో సాగిన ఆయన ప్రసంగాన్ని ఎస్డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అయ్యప్ప రెడ్డి తెలుగులోకి తర్జుమా చేసి వివరించారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నర్సింగరావు మాట్లాడుతూ రవాణా రంగం స్తంభిస్తే దేశం స్తంభిస్తుందన్నారు. రాష్ట్రంలో ట్రాన్స్‌పోర్ట్ లేకుండా చేయడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఎలక్ట్రికల్ బస్సులు ప్రోత్సహిస్తూ ఆర్టీసీని కుదేలు చేస్తున్నారని, ప్రభుత్వ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతున్న ప్రైవేటు శక్తులను ఎదుర్కొన్న చరిత్ర సీఐటీయూకి ఉందని గుర్తు చేశారు. దేశానికి స్వాతంత్రం వచ్చినప్పుడు పెట్టుబడుదారులు బలహీనంగా ఉన్నారని, అప్పుడు ప్రజా సొమ్ముతో ప్రభుత్వ రంగాలను అభివృద్ధి చేశారని, ఇలాంటి విధానాలతో ప్రజలకు ఎంతో మేలు చేకూరిందన్నారు. అందుకు నిదర్శనమే పెట్టుబడిదారులకు వ్యతిరేకంగా.. బ్యాంకుల జాతీయకరణ విధానంతో ఇందిరాగాంధీ విజయం సాధించిందని గుర్తు చేశారు. స్వతంత్ర భారతదేశంలో 121 భారీ పరిశ్రమలకు రష్యా సహకరించిందని, సోషలిస్ట్ దేశాల సహకారంతోనే పరిశ్రమల అధికంగా దేశానికి వచ్చాయన్నారు. 1991 నుంచి దేశంలో ఎల్పీజీ (లిబల్ రైజేషన్, ప్రైవేటీ రైజేషన్, గ్లోబలైజేషన్) పేరుతో ప్రైవేటీకరణ సరళీకరణ అని చెబుతూ ప్రభుత్వ రంగాన్ని నాశనం చేయడానికి నాంది అయిందన్నారు. కానీ అప్పటినుంచి వాటిని అమలుకానీయకుండా సిఐటియు అనుబంధ సంఘాలు కార్మికులకు అండగా పోరాటం చేస్తున్నయన్నారు. 1991లో అప్పటి ఆర్థిక మంత్రి మన్మోహన్ సింగ్ పార్లమెంటులో మరో రెండు సంవత్సరాల్లో ప్రైవేటీకర్ణను పూర్తిగా అమలు చేస్తామని ప్రకటించారని, 32 సంవత్సరాలు పూర్తవుతున్న అవి అమలు కాకపోవడానికి కార్మికుల పోరాటాలే కారణమన్నారు. కేంద్ర, రాష్ట్ర పాలకుల పాలసీ ప్రైవేటికరణ విధానమేనన్నారు. 2014 నుంచి కార్పోరేట్ శక్తులు, మతత్వ శక్తులు ఏకమై ఇండియాను బహుళ జాతి కంపెనీలకు అప్పణంగా అప్పగించేందుకు కుట్ర చేస్తున్నాయన్నారు. అందుకు ప్రధాన వనరులైన సముద్రతీరం, భారీ పరిశ్రమలు, భూములు, భూగర్భ ఖనిజాలను కాజేస్తున్నాయని తెలిపారు. రాష్ట్రంలో చంద్రబాబు 3డి సినిమాలు ప్రజలకు చూపిస్తున్నారని, అమరావతిలో డేటా సెంటర్ (టెక్నాలజీ గోడౌన్‌ను) ఏర్పాటు చేస్తానని ప్రకటించారని, ఇప్పటివరకు ఉన్న డేటా సెంటర్లన్నీ, సముద్రంలో ఉన్నాయని, అవి అక్కడ ఉంటేనే రేడియేషన్లను తట్టుకుని నిలబడతాయన్నారు. అలాంటి వాటిని నగరం నడిబొడ్డున ఏర్పాటు చేస్తానని చెప్పడం విడ్డురమన్నారు. ఇలాంటి తరుణంలో ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకునేందుకు కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా ఉద్యమించి పాలకులను నిలదీసి సంస్థలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. గౌరవ అతిథిగా హాజరైన ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు దామోదర్ మాట్లాడుతూ ఎంప్లాయిస్ సంఘం, ఎస్‌డబ్ల్యుఎఫ్ భావనలు వేరైనా, సంస్థ పరిరక్షణకు ఐక్యంగా పోరాడుతామన్నారు. కార్మిక సంఘాలను విడగొట్టేందుకు పాలకులు కుట్ర చేశారని, ప్రభుత్వం విలీనానికి ముందు ఎనిమిది సంఘాలు ఉన్న ఆర్టీసీలో విలీనం తర్వాత 32 సంఘాలు ఏర్పడడం ఇందుకు నిదర్శనమన్నారు. సంఘాలు విచ్ఛిన్నమయ్యే కొద్ది యాజమాన్యానికి శక్తి పెరుగుతుందని, ఇది సంస్థ నిర్వీర్యానికి పునాది అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన శ్రీ శక్తిని సమర్థిస్తాం, కానీ సిబ్బందిపై పెరుగుతున్న పని ఒత్తిడిని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అందుకు తగ్గట్టుగా మూడు వేలు కొత్త బస్సులను, 10వేల మంది సిబ్బందిని భర్తీ చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి, ఆర్టీసీ సంస్థను కాపాడుకునేందుకు ఐక్య పోరాటాలు సాగిద్దామని, అందుకు తాము సిద్ధమని ప్రకటించారు. ఈ సమావేశంలో ఏఐటి డబ్ల్యూఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముజీఫర్ అహ్మద్, కార్యదర్శి వివిఎస్ రావు, టిఎస్‌ఆర్టిసి రాష్ట్ర అధ్యక్షులు వీరాంజనేయులు, ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసయ్య, శ్రామిక మహిళా కన్వీనర్ సీతాలక్ష్మి, సిఐటీయు జిల్లా అధ్యక్షులు జయచంద్ర, జిల్లా ఉపాధ్యక్షులు జిబి సుబ్రహ్మణ్యం, ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకులు పరుశురాం, భాస్కర్, శివకుమార్, అజం ఖాన్, దినకరన్, ఏపీఎస్‌ఆర్టీసీ కార్మికులు పాల్గొన్నారు.

# వదలని వాన

● అత్యధికంగా వెంకటగిరి మండలంలో 14.2 మిల్లీ మీటర్లు నమోదు

మునగలపాలెం స్వర్ణముఖి నది వద్ద రహదారిపై పారుతున్న వరద నీరు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి జిల్లాలో గురువారం కూడా పలు మండలాల్లో వర్షాలు కురిసాయి. వెంకటగిరి మండలంలో అత్యధికంగా 14.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నమోదైన వర్షపాత వివరాలు ఇలా ఉన్నాయి. కేవలం 15 మండలాలు మాత్రమే వర్షపాతం నమోదు కాగా మిగిలిన మండలాల్లో వర్షపాతం నమోదు కాలేదు. జిల్లా వ్యాప్తంగా 17.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయింది. వెంకటగిరి...14.2 మి.మి, బుచ్చి నాయుడు కండ్రిగ...12.6 మి.మి, దొరవారిసత్రం...7.2 మి.మి, సూళ్లూరుపేట....5.6 మి.మి, రేణిగుంట...4.4 మి.మి, ఓజిలి....2.8 మి.మి, చిల్లకూరు...1.8 మి.మి, గూడూరు...1.4 మి.మి, నారాయణవనం...1.2 మి.మి, పుత్తూరు....1.2 మి.మి, ఏర్పేడు....1.2 మి.మి, వాకాడు....1.0 మి.మి, తొట్టంబేడు....1.0 మి.మి, నాయుడుపేట....0.4 మి.మి, కోట...0.4 మిల్లీ మీటర్ల వర్షపీతం నమోదయింది.

### వర్షాలపై దుబాయ్ నుంచి సీఎం ఆరా

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దుబాయ్ నుంచి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్షం ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. తిరుపతి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ డా ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు టెలి కాన్ఫరెన్స్‌కు హాజరయ్యారు. ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. వర్షం ప్రభావిత ప్రాంతాలైనా గుంటూరు, బాపట్ల, నెల్లూరు, ప్రకాశం, కడప, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, అనంతపురం, కర్నూలు జిల్లాలలో మందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వర్ష ప్రభావిత ప్రాంతాలలో ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాలను పంపాలని సూచించారు. ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేలా చూడాలన్నారు. కాలువ, చెరువుగట్లకు గండ్లు పడకుండా బలహీనంగా ఉన్నచోట్ల పటిష్ట పరచాలని సూచించారు. జిల్లాలో వర్షం వలన చెరువులు నిండిన తర్వాత ఆ నీటిని వృధా కాకుండా నిల్వ చేసుకోవాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరిస్తూ.. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలందరూ అప్రమత్తంగా ఉండేలా అన్ని చర్యలు చేపట్టడం జరిగిందని తెలిపారు. జిల్లా, డివిజన్, మండల స్థాయిలలో భారీ వర్షం నేపథ్యంలో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఎక్కడా వర్షపు నీరు నిల్వ లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నీరు కలుషితం లేకుండా ఎప్పటికప్పుడు వాటర్ టెస్టింగ్ కూడా జరుపుతున్నామని తెలిపారు. జిల్లాలో వర్షం వలన దెబ్బతిన్న రోడ్లు పరిస్థితిపై సీఎంకు వివరించారు.

### లోతట్టు ప్రాంతాల ప్రజలకు పరామర్శ

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** నగరంలోని లోతట్లు ప్రాంతాల్లో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం గురువారం సందర్శించారు. తిరుపతిలో గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా కొర్లగుంట ప్రాంతంలో పలుచోట్ల రోడ్లపై నీరు చేరడం, కాలువలు పొంగి నీరు జనావాసాల్లోకి రావడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని తెలుగు యువత రాష్ట్ర అధికార ప్రతినిధి పెరుమాళ్ మధు సమాచారంతో అయన ఆ ప్రాంతాన్ని తెలుగుదేశం నాయకులతో కలిసి పర్యటించారు. ఆయన వెంట టీడీపీ రాష్ట్ర కార్యదర్శి బుల్లెట్ రమణ, రాష్ట్ర నాయకులు కృష్ణ యాదవ్, ఐదవ వార్డు సెక్రటరీ మధు విజయలక్ష్మి, విశ్వనాథ్, రాజారాం, జగన్నాథం తదితరులున్నారు.

**ప్రజాశక్తి - శ్రీకాళహస్తి రూరల్(తొట్టంబేడు):** మండలంలోని తొట్టంబేడు పంచాయతీ పరిధిలోని ఎల్.ఐ.సి కాలనీ, ఈదులగుంట కాలనీ, బంగారమ్మ కాలనీ, బీడీ కాలనీల్లో గత మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాలకు వర్షపు నీరు ఇళ్లల్లోకి చేరింది. గురువారం ఎం.పీ.డీ.వో సురేంద్రనాథ్, మండల తాసిల్దార్ భారతి దృష్టికి రావడంతో వెంటనే సహాయక చర్యలు చేపట్టారు.

### గిరిజనులను ఆదుకోండి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** భారీ వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనీ, వెంటనే పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ గిరిజన సలహా మండలి సభ్యులు ఎం సుబ్బయ్య సంబంధిత అధికారులకు గురువారం విజ్ఞప్తి చేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని గిరిజనులకు గత నాలుగు రోజులుగా పని లేకుండా పోయిందన్నారు. వారికి నిత్యావసర సరుకులు, రూ. 2 వేలు ఆర్థిక సాయం అందించాలని కోరారు.

### అరణియార్ ప్రాజెక్టుపై నిఘా ఉంచండి : ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం

**ప్రజాశక్తి - పిచ్చాటూరు:** భారీ వర్షాలు నేపథ్యంలో అరణియార్ గేట్లపై నిఘా ఉంచాలని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఇరిగేషన్ అధికారులకు సూచించారు. గురువారం అరణియార్ స్పిల్ వే గేట్లును అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 27.8 అడుగులకు చేరిందన్నారు. తిరుపతి జిల్లా సత్య వేడు నియోజకవర్గంలోని పిచ్చాటూరు జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 31 అడుగులని, ఈ ఏడాది కూడా పూర్తి స్థాయిలో ప్రాజెక్టు నిండడం సంతోషంగా ఉందని తెలిపారు. ఆయన వెంట ఇరిగేషన్ డీఈ శ్రీనివాసులు, ఏఈ ధరణీ కుమార్, ఏఎంసీ మాజీ చైర్మన్ డి ఇలంగోవన్ రెడ్డి తదితరులున్నారు.

### చెరువులను పరిశీలించిన తహశీల్దార్ శ్రీదేవి

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండిపోవడంతో కాటూరు, వేణుగోపాలపురం, కుక్కంబకం గ్రామాల్లోని చెరువులు తెగిపోయే స్థితికి చేరుకున్నాయి. ముందస్తు జాగ్రత్తగా గురువారం తాహశీల్దార్ శ్రీదేవి తన సిబ్బందితో మూడు గ్రామ పంచాయతీలకు వెళ్లి గ్రామస్తులతో కలిసి చెరువులు తెగకుండా ఇసుక బస్తాలు వేయించారు. ఇరిగేషన్ అధికారులకు తగు సూచనలు చేశారు.

### తెగిన జంగాలపల్లి చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే బొజ్జల

**ప్రజాశక్తి -ఏర్పేడు :**వర్షాల కారణంగా జంగాలపల్లి చెరువు కట్ట తెగిపోవడంతో రింగ్ బడ్‌ను ఏర్పాటు చేశారు. జంగాలపల్లికి వెళ్లే వరవ కాలువ ఉధృతంగా ప్రవహించడంతో ఐజర్ వద్ద ఏర్పాటు చేసిన అండర్ బ్రిడ్జ్ వద్ద వరవ కాలువ సైజు తగ్గించి నిర్మించడంతో ఒక్కసారిగా వేగం పెరిగిన వరద ప్రభావంతో గతంలో నిర్మించిన రింగ్ బడ్ కొట్టుకుపోయింది. ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి తెగిన చెరువు కట్టను పరిశీలించి పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

### పాకాల చెరువుకి అమ్మ చెరువు నుంచి వరదనీరు

**ప్రజాశక్తి - పాకాల:** పాకాల మండలం, పెద్దరామాపురం పంచాయతీ దగ్గర ఉన్న అమ్మ చెరువు కురుస్తున్న వర్షాలతో నిండు కుండాలా మారింది. దీనితో గురువారం రాత్రిలోగా పాకాల చెరువుకి వరద నీరు చేరనుంది. అధికారులు అప్రమత్తమై ఎవరు చేపల వేటకు వెళ్ళకూడదని హెచ్చరించారు. ఎమ్మెల్యే పులివర్తి నానీ ఎప్పటికప్పుడు చెరువులపై ఆరా తీస్తూ అధికారుతో మాటాడుతున్నారు.

### రాయల చెరువును పరిశీలించిన ఎమ్మెల్యే నాని

**ప్రజాశక్తి - రామచంద్రాపురం :** భారీ వర్షాల కారణంగా చంద్రగిరి నియోజకవర్గంలో ముంపుకు గురైన ప్రజలు, పాడు రైతులకు అండగా ఉంటూ, ఆదుకుంటానని చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని పేర్కొన్నారు. గురువారం మండలంలోని శ్రీకృష్ణదేవరాయల కాలంలో నిర్మించిన రాయలచెరువును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వర్షాల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాయలచెరువుకు వరద నీరు రావడంతో ముంపుకు గురైన పంటలు నష్టపోయిన రైతులకు నష్టపరిహారం అందజేస్తానని, పాడి రైతులకు పశుసంవర్ధక శాఖ ద్వారా పశుగ్రాసాన్ని అందజేసి ఆదుకుంటానన్నారు.

### నాగయ్యగారిపల్లి స్వర్ణముఖిపై కృంగిన మట్టి కల్వర్టు

**ప్రజాశక్తి - చంద్రగిరి:** భారీ వర్షాలతో చంద్రగిరి మండలం, నాగయ్యగారిపల్లి వద్ద స్వర్ణముఖీ నదిపై మట్టితో నిర్మించిన కల్వర్టు కృంగిపోయింది. ఆర్డిఓ రామ్మోహన్, తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఆర్అండ్ బి డిఈ శ్రీనివాసులు గురువారం సంఘటనా స్థలికి చేరుకుని కల్వర్టును పరిశీలించారు. తాత్కాలికంగా ముళ్ళకంచెను ఏర్పాటు చేయించారు. ఈ మార్గంలో రాకపోకలు సాగించవద్దని గ్రామస్తులకు సూచించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయానికి చేరుకున్న ఆర్డిఓ రెవెన్యూ యంత్రాంగంతో వర్షాలపై సమీక్షించారు.

## చేపల వేటకు వెళ్లి గిరిజనుడు గల్లంతు

**ప్రజాశక్తి - దొరవారిసత్రం :** చేపల వేటకు వెళ్లి గిరిజనుడు గల్లంతు అయన ఘటన మండలపరిధిలోని తనయాలి గ్రామం వద్ద ఉన్న కాళంగి నది వద్ద చోటు చేసుకొంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు నెల్లూరు ప్రాంతానికి చెందిన మేకల పోలయ్య (23) గత కొంత కాలంగా పోలిరెడ్డిపాలెంలో నివసితున్నాడు. గురువారం కొంతమంది గిరిజనులు చేపలు పట్టడానికి వెళ్లారు. వాళ్ళతో పోలయ్య వెళ్ళాడు. కాళంగి నదిలో దిగి వల వేస్తున్న సమయంలో, నదిలోని నీళ్లు ఒక్కసారిగా ఉధృతంగా ప్రవహించడంతో పొల్లయ్య గల్లంతయ్యాడు. అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.

## అవినీతి పెరగడంతోనే విద్యుత్ భారాలు

● రిటైర్డ్ అడిషనల్ డీజీ ఏబి వెంకటేశ్వరరావు

ఏపీ ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతాటికి వినతి పత్రం ఇస్తున్న వెంకటేశ్వరరావు

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** విద్యుత్ సంస్థల్లో అవినీతి భారీగా పెరిగిపోవడం వల్లనే వినియోగదారులకు భారాలు తప్పడం లేదని రిటైర్డ్ అడిషనల్ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు తెలిపారు. ఏపీ ఎస్పీడీసీఎల్ పరిధిలో జరిగిన భారీ అవినీతిపై విచారణ చేపట్టాలని కోరుతూ గురువారం ఆయన ఏపీ ఎస్పీడీసీఎల్ సిఎండి శివశంకర్ లోతాటికి వినతి పత్రం అందజేశారు. తిరుపతి కార్పోరేట్ కార్యాలయంలో సీఎండిని కలిసిన ఆయన మీడియాతో మాట్లాడుతూ విద్యుత్ రంగం ప్రతి ఒక్కరిని టచ్ చేస్తుందని, ఇందులో తప్పు జరిగితే ఆ భారం ప్రజలపై ప్రభావం చూపుతుందన్నారు. ఏపీఎస్పిడీసీఎల్‌ను పాలన సౌలభ్యం కోసం మూడు డిస్కమ్ లుగా విభజించారని, కానీ విభజన తర్వాత అవినీతి పెరిగిపోయిందన్నారు. డిస్కమ్‌లలో అవినీతి తగ్గిస్తేనే విద్యుత్ చార్జీలు తగ్గుతాయన్నారు. ప్రణాళికా లోపం, పారదర్శకత లోపం వల్ల రూ.40 వేలు కోట్లకు పైగా అవినీతి జరిగిందని, ఈ భారం ప్రజలపై పడిందని, వారు ఇప్పుడు కట్టకపోయినా మరో ఐదేళ్ల తర్వాత అయినా తప్పక కట్టాల్సిందేనన్నారు. ఏపీఎస్పీడీసీఎల్‌లో అవినీతి సీఎండి సంతోష్ రావు హయాంలో తీవ్రమైందన్నారు. ఆర్టిఐ ద్వారా సమాచార ఇవ్వాలని డజన్లోకొద్దీ అర్జీలు పెట్టిన స్పందన లేదన్నారు. ఎలాగోలా తమ కొన్ని ఆధారాలు సేకరించి వాటిని ప్రజల ముందుకు పెట్టామని, దీని ద్వారా గత సీఎండిని ప్రభుత్వం బదిలీ చేయడంతో తాత్కాలిక ఉపశమనం కలిగిందన్నారు. పూర్తి విచారణ జరిపి, బాధ్యులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. పూర్తిస్థాయి విచారణ కోరుతూ సీఎండీ శివశంకర్‌కు విన్నవించామని, అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని తెలిపారు. శుక్రవారం తిరుపతి నగరంలో జరిగే రౌండ్ టేబుల్ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ముందు ఈ అవినీతి బాగోతాన్ని పై చర్చ నడుపుతామన్నారు. సెంటర్ ఫర్ లిబర్టీ వ్యవస్థాపకులు ఏ.చక్రవర్తి మాట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో విద్యుత్ పరికరాల్లో జరిగిన అవినీతిని వెలికి తీసి, దానిపై విచారణ చేపట్టాలని కోరుతూ ఎస్పీడీసీఎల్ సీఎండీని కలిసి వినతిపత్రం సమర్పించామన్నారు. దీనిపై ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలతో చర్చ వేదికలు నిర్వహిస్తామని తెలిపారు.

## ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాలకు సిద్ధంకండి : షర్మిల

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యవంతం చేసి పోరాటాలకు సిద్ధం కావాలని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి పిలుపునిచ్చారు. ఏఐసిసి, పిసిసి పిలుపుమేరకు ఓట్ చోరీకి వ్యతిరేకంగా తిరుపతి నియోజకవర్గ పరిధిలో సేకరించిన 21 వేల ప్రజా సంతకాలను గురువారం విజయవాడలోని పిసిసి కార్యాలయంలో అధ్యక్షురాలు వైఎస్ షర్మిలమ్మకు తిరుపతి నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గౌడపేరు చిట్టిబాబు, పార్లమెంట్ అధ్యక్షుడు బాల గురవం బాబు, రాయలసీమ జిల్లాల ఇన్చార్జ్, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లి, తిరుపతి జిల్లా ఇన్చార్జ్ ఈద సుధాకర్ రెడ్డిల ఆధ్వర్యంలో అందజేశారు. 21 వేల మంది ప్రజల సంతకాలు సేకరించిన తిరుపతి నగర కమిటీని పీసీసీ అధ్యక్షురాలు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి తమటం వెంకట నరసింహులు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చిత్తూరు శివశంకర్, క్రిష్టియన్ మైనారిటీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాల్మన్ రాజు, శ్రీ కాళహస్తి నియోజకవర్గ సమన్వయకర్త తలప దామోదర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గజ దాడులతో కంటిమీద కునుకు లేదు

■ పంటలను తొక్కి నాశనం చేసిన ఏనుగులు

**ప్రజాశక్తి - చంద్రగిరి:** చంద్రగిరి మండలం, భీమవరం వద్ద, ఎగువ కూచివారిపల్లెలో గురువారం తెల్లవారుజామున పంట పొలాలపై ఏనుగుల దాడులు చేశాయి. అటవీప్రాతంలో నుంచి పంట పొలాలపై పడి అందినంత తిని పంటలను తొక్కుతూ నాశనం చేస్తున్నాయి. పంట కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో ఏనుగుల దాడులతో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. మండలంలోని రంగంపేట, యల్లంపల్లి, చిన్న రామాపురంలోని అటవీ సమీపంలోని పంట పొలాలపై గత వారం రోజులుగా దాడులు జరుగుతూనే ఉన్నాయి. ఏనుగులను గుర్తించిన గ్రామస్తులు అటవీ అధికారులకు సమాచారం అందించారు. అర్ధరాత్రి తర్వాత గ్రామస్తులు, అటవీ అధికారులు సంయుక్తంగా బాణాసంచా పేల్చుతూ, కేకలు వేయడంతో ఏనుగులు అడవుల్లోకి వెళ్లిపోయాయి. ఏనుగుల దాడితో రాత్రిళ్లు కంటిపై కునుకు లేకుండా పరుగులు తీయాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. అటవీశాఖ అధికారులు ఏనుగుల కదలికలను తెలుసుకొని సకాలంలో స్పందించి రైతుల పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బౌ.. బౌలకు భయపడను : భూమన

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ :** కొంతమంది పని కట్టుకున్న తనపై చేస్తున్న వ్యక్తిగత దాడికి, బౌ బౌలకు భయపడే వ్యక్తిని కాదని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి తెలిపారు. తిరుపతి ఎస్వీ గోశాలలో గోవులు అత్యధికంగా మృతి చెందటం పట్ల ఆయన గతంలో విమర్శలు చేశారు. దీనిపై టిటిడి పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి ఈ ఏడాది మార్చి 11వ తేదీన ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు గురువారం అయినను విచారణకు పిలిచారు. విచారణ అనంతరం పద్మావతి పురంలోని కరుణాకర్ రెడ్డి నివాసం వద్ద ఆయన విలేకరితో మాట్లాడుతూ గత నెలలో తనను విచారణకు పిలిచారని, తాజాగా గురువారం కూడా విచారణకు పిలిచారని ఈ సందర్భంగా పోలీస్‌లు తన పట్ల మర్యాదగా వ్యవహరించారని వెల్లడించారు. డీఎస్పీ భక్తవత్సలం, సిఐ రామయ్య అడిగిన ప్రశ్నలకు తాను సమాధానాలు ఇచ్చానన్నారు. తాను చేసిన ఆరోపణలకు కట్టుబడి ఉన్నానని, ఆధారాలు లేకుండా అవతల వారి వ్యక్తిత్వ హననం కోసం మాట్లాడనని తెలిపారు. తాను చేసిన ఆరోపణల తో సమాధానము ఇవ్వాల్సింది పోయి తనపై వ్యక్తిగత దాడులకు దిగుతున్నారని, గత మూడున్నర సంవత్సరంగా తనపై అనేక ఆరోపణలు చేస్తున్నారని, వారి చేతిలో అధికారం ఉంది కదా తనపై ఎందుకు చర్యలు తీసుకోరని ప్రశ్నించారు. తాను అధికారంలో ఉన్నప్పుడు, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వీరి విమర్శలు తప్పడం లేదన్నారు. తను టీటీడీ చైర్మన్‌గా ఉన్నప్పుడు పలు నిర్మాణాలలో అవినీతి చేశానని కాంట్రాక్టర్లు తను సహకరించారని, ఆ నిర్మాణాలను రద్దు చేస్తామని విమర్శ చేసిన టిటిడి చైర్మన్ బి.ఆర్ నాయుడు, ఆ నిర్మాణాలన్నిటిలో ఒకటి తప్ప మిగతావన్నీటికి బిల్లులు అందజేసి వాటిని కొనసాగించాలని సాక్షాత్తు ఈవోకు కాన్ఫిడెన్షియల్ లేఖ రాయడం విడ్డూరంగా ఉందన్నారు. కాంట్రాక్టర్లతో కమిషన్లు కుదిరిన తర్వాత ఇలాంటి అధికారిక లేఖ రాశారని, వాస్తవానికి టీటీడీ పాలకమండలి అధ్యక్షులకు బోర్డు సమావేశమునపుడు తప్ప మిగతా రోజుల్లో పాలన వ్యవహారాల్లో తల దూర్చరాదని, అలాంటిది ఏకంగా పలానా వాళ్ళకి బిల్లులు చెల్లించని లేఖలు రాయడం విడ్డూరంగా ఉందన్నారు. దీనిపై బిఆర్ నాయుడు ఏం సమాధానం చెప్తారో చూడాలన్నారు. తిరుమలలోని తన కార్యాలయంలో బి.ఆర్ నాయుడు వల్లెవేస్తున్న బూతు పురాణమే ఆయనలోని నిజమైన భక్తి భావాన్ని తెలియజేస్తుందని ఎద్దేవా చేశారు. ఈ సమావేశంలో వైయస్సార్సీపీ నగర అధ్యక్షులు చంద్ర రెడ్డి ఖాదరి, తదితరులు పాల్గొన్నారు

## భూమనపై విచారణ డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగమే

● తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ధ్వజం

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** ఆంధ్రప్రదేశ్‌లో డైవర్షన్ పాలిటిక్స్ నడుస్తున్నాయని, అందులో భాగంగానే తమ పార్టీ సీనియర్ నేత, టీడీపీ మాజీ చైర్మన్ భూమన కరుణాకరరెడ్డిని పోలీసులకు విచారణకు పిలిచారని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి ఆరోపించారు. టీటీడీకి సంబంధించిన గోశాలలో, గోవులు పెద్ద సంఖ్యలో మరణించడంపై వివరాలు బయట పెట్టారనే కారణంతో, ఈరోజు భూమనను ఎస్వీ యూనివర్సిటీ పోలీసులు విచారణకు పిలిచారన్నారు. పోలీసుల విచారణకు వెళ్లిన భూమన వెంట, తిరుపతి ఎంపీ గురుమూర్తి కూడా ఉన్నారు. ఎస్వీ యూనివర్సిటీ వద్ద గురువారం మీడియాతో ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు. తప్పుల్ని సరిదిద్దుకోడానికి, వాస్తవాల్ని బయటపెట్టిన భూమనను విచారణ పేరుతో వేధించడం సబబు కాదన్నారు. గోవుల మరణాలపై పాలకుల్లోనే స్పష్టత లేదని ఆయన గుర్తు చేశారు. విచారణ పేరుతో గంటల తరబడి వేధించడం సరికాదన్నారు. రాష్ట్రంలో వైద్య కళాశాలల ప్రైవేటీకరణ, అలాగే నకిలీ మద్యం తయారీ తదితర అంశాలపై తీవ్ర ప్రజావ్యతిరేకత కనిపిస్తోందన్నారు. ఇలాంటి వాటి నుంచి ప్రజల్ని పక్కదారి పట్టించే డైవర్షన్ పాలిటిక్స్‌లో భాగంగానే భూమనను విచారణకు పిలిచారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోవాలని, హామీల అమలుకు ముందుకు రావాలని డిమాండ్ చేశారు.

## గరుడవారధిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేయండి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** గరుడవారధిపై సూచిక బోర్డులు ఏర్పాటు చేసి, డివైడర్ల మధ్య మొక్కల నాటి పచ్చదనం పెంచి చక్కగా నిర్వహణ చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య స్మార్ట్ సిటీ అధికారులు, ఆఫ్కాన్స్ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ ప్రాజెక్టులో భాగంగా నగరంలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిపై గురువారం అధికారులు, ఆయా సంస్థల ప్రతినిధులతో మేనేజింగ్ డైరెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. గరుడ వారధి, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, తదితర ప్రాజెక్ట్ పురోగతిని ఆయా సంస్థల ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ మాట్లాడుతూ గరుడవారధి రోడ్ల నిర్వహణ బాగా ఉండాలని, అలాగే ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని తెలిపారు. గరుడవారధి కింద డివైడర్ల మధ్య, కూడళ్లలో పచ్చదనం పెంచేలా మొక్కలు నాటాలని ఆదేశించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. నగరంలో ఏర్పాటు చేస్తున్న సిసి కెమెరాల పనులు డిసెంబర్ లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, స్మార్ట్ సిటీ జి. ఎం. చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, ఈ.ఈ. రవి, డిసిపీ ఖాన్, డి.ఈ.లు రాజు, శిల్ప, ఏసీపీ లు మూర్తి, మధు,ఉద్యానవన శాఖాధికారి హరికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ గ్రానైట్ క్వారీలను రద్దు చేయాలి

**ప్రజాశక్తి - పుత్తూరు టౌన్:** స్థానిక పుదుపేట సంఘం పరిధిలోని చెర్లోపల్లిలో అక్రమ గ్రానైట్ క్వారీలను రద్దు చేయాలని సిపిఎం, సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో గురువారం తాసిల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ పార్టీ పుత్తూరు మండల కార్యదర్శి డి మహేష్, సిపిఎం డివిజన్ కార్యదర్శి ఆర్ వెంకటేష్ మాట్లాడుతూ పుత్తూరు మండలం పరిధిలో క్వారీలు గ్రానైట్ క్వారీలు పనిచేస్తున్న కార్మికులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అక్రమంగా నడుపుతున్న క్వారీలను గుర్తించి రద్దు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు భాస్కర్, రవి గోవిందు, సిపిఎం నాయకులు విజయ్, భాషా, బాబ్జి, రామలింగం తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ

**ప్రజాశక్తి - గూడూరు టౌన్:** కోట మండల పరిధి, కొత్తపట్నం పంచాయతీ, పెద్ద గోవిందపల్లికి చెందిన కాల్తిరెడ్డి సుభాషిణి తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ తిరుపతి, స్విమ్స్ హాస్పిటల్‌లో వైద్యం చేయించుకుంటోంది. విషయం టిడిపి సీనియర్ నాయకులు చిల్లకూరు దశరథ రామిరెడ్డి ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు తెలిపి, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆయన తక్షణమే సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి 3 లక్షల రూపాయలు మంజూరు చేసి బాధితురాలి కుటుంబ సభ్యులకు అందజేశారు.

## వంతెన ఏర్పాటుచేయండి : సిపిఎం

**ప్రజాశక్తి - కేవిబి పురం:** కేవీబీ పురం మండలం, కొట్టాల మిట్ట ఎస్టీ కాలనీకి వెళ్లే రహదారులకు చిన్నపాటి వర్షానికి జలమయమవుతూ గ్రామస్తులు ఇక్కట్లు పడుతున్నారని, ప్రభుత్వం స్పందించి వంతెన ఏర్పాటు చేయాలని సిపిఎం జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. ఆయన మాట్లాడుతూ కేవీబీ పురం మండలంలో, కొట్టాల మిట్ట ఎస్టీ కాలనీ, వగత్తూరు ఎస్టీ కాలనీ, జయ లక్ష్మాపురం ఎస్టీ కాలనీలకు వెళ్లే మార్గంలో వంతెన లేకపోవడంతో కాలనీవాసులు ఇబ్బంది పడుతున్నారని, వర్షాకాలం వస్తే ఆ మార్గాలు జలమయం అవుతున్నాయని తెలిపారు. జయలక్ష్మీపురం ఎస్టీ కాలనీ వాసులు వెళ్లే మార్గం కూడా మరమ్మతులు చేపట్టాలని కోరారు. వర్షాలు వస్తే కూలి చేసుకునే యానాదులు బయట వెళ్లలేని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, నాయకులు స్పందించి ఈ కాలనీలకు వంతెనలు ఏర్పాటు చేయాలని కోరారు.

## పిఎసిఎస్ చైర్మన్‌గా సుబ్రహ్మణ్యం రాజు

**ప్రజాశక్తి - నాగలాపురం:** నాగలాపురం మండల పిఎసిఎస్ చైర్మన్‌గా బీర కుప్పం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం రాజు గురువారం బాధ్యతలు చేపట్టారు. డైరెక్టర్‌గా గోపీనాథ్ రెడ్డి, రాజశేఖర్ యాదవ్ బాధ్యతలు చేపట్టారు. సుబ్రహ్మణ్యం రాజుని మండల టిడిపి అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పార్థిబన్, ఎండి కుమార్, రుద్రయ్య, నమశ్శివాయం, మనోజ్, నెల్సన్ మండేలా, నాగరాజ్ తదితరులు పాల్గొన్నారు.

## డీఏ సవరణతో ఒరిగేదేమీ లేదు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** డీఏ సవరణతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఒరిగేదేమీ లేదని ఏపీటీఎఫ్ బి.మురళీ కృష్ణ గురువారం విమర్శించారు. గత ప్రభుత్వం డిఏలు, పీఆర్సీ విషయంలో ఉద్యోగ, ఉపాధ్యాయులను నిలువునా ముంచిందని, కూటమి ప్రభుత్వం కూడా గత ప్రభుత్వ బాటలోనే నడుస్తోందని మండిపడ్డారు. జనవరి 2024 నుండి రావలసిన డీఏని 2027 వరకు చెల్లించాలని చేసే ఇంకా ప్రకటించలేదని మూడు డిఎలు ఎప్పుడు చెల్లిస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే 27 నెలల నుండి బాకీపడిన 12వ పీఆర్సీ కమిషన్ కూడా ఇప్పటివరకు నియమించకపోవడం బాధాకరమన్నారు. ఐఆర్‌ను ఇప్పటి వరకు ప్రకటించలేదన్నారు.

## ప్రత్యేక రాయలసీమ ఏర్పాటుకై ఉద్యమిద్దాం

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** రాయలసీమ ప్రాంతానికి ఉన్న సమస్యలు పరిష్కరించబడాలంటే శ్రీబాగ్ ఒడంబడిక ఒప్పందాన్ని అమలు చేయాలని, ప్రత్యేక రాయలసీమ ఏర్పాటుకై రాయలసీమ రాష్ట్ర సమితి పార్టీ ఆధ్వర్యంలో ఉద్యమ పోరాటాలకు ప్రజలు మద్దతు ఇవ్వాలని పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు కుంచం వెంకటసుబ్బారెడ్డి పిలుపునిచ్చారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ప్రత్యేక రాయలసీమ ఏర్పాటు సాధనకై రూపొందించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ రాయలసీమ నుండి ప్రాతినిధ్యం వహించిన పాలకులు రాయలసీమ అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదన్నారు. కేంద్ర ప్రభుత్వం దిగివచ్చేలా రాయలసీమ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో నవంబర్ 16న కర్నూలులోని అంబేద్కర్ భవన్ వేదికగా పెద్ద ఎత్తున సభను నిర్వహిస్తున్నామని తెలిపారు. పార్టీలకతీతంగా రాయలసీమ అభివృద్ధిని కోరుకునే వారందరినీ కలుపుకొని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు.

## ఉన్నతాధికారులు స్పందించాలి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తాను కొనుగోలు చేసిన ఇంటి స్థలానికి సంబంధించిన ఐదు అడుగుల స్థలాన్ని మా ఇంటికి ఆనుకుని ఉన్న ఇంటి వారు దౌర్జన్యంగా నిర్మాణం చేసి లోపలికి వెళ్లే మార్గాన్ని ఆక్రమించారని, జిల్లా ఉన్నతాధికారులు స్పందించి దారి సమస్యను పరిష్కరించాలని తిరుపతి నగర పరిధిలోని సత్యనారాయణపురంకు చెందిన మరాఠీ ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన కుటుంబ సభ్యులు, స్థలవిక్రేత మునిలక్ష్మితో కలిసి మాట్లాడారు.

# ఎన్నాళ్లీ వానాకాలం కష్టాలు..?

■ వాగులు దాటాలంటే వణుకు ■ వంతెనలు కట్టరు.. కాజ్‌వేల ఎత్తు పెంచరు ■ మొద్దు నిద్రలో పాలకులు

పెద్దగా ఉపయోగంలో లేని పెద్దకన్నలి వద్ద నిర్మించిన వంతెన (ఫైల్ ఫోటో)

చిట్టత్తూరు వాగు

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:** వానాకాలం వచ్చిందంటే చాలు.. నియోజకవర్గ ప్రజలకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదు. వాగులు, వంకలు, ఏర్లు, నదులు ఉప్పొంగి ప్రవహించే నేపథ్యంలో వాటిపై నిర్మించిన కల్వర్టులు, కాజ్‌వేలపై ప్రయాణం ప్రమాదకరంగా మారుతోంది. పలుచోట్ల వరద ఉద్ధృతి తగ్గే వరకు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతున్నాయి. అత్యవసర పరిస్థితుల్లో సాహసించి వెళ్లేవారు గల్లంతైన సంఘటనలు అనేకం ఉన్నాయి. అయినా పాలకుల్లో ఎలాంటి చలనం లేదు. పాలకులు మారుతున్నా.. దశాబ్దాలుగా తమకు ప్రయాణ కష్టాలు తప్పడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

### వాగులు దాటాలంటే వణుకు

నియోజకవర్గం వ్యాప్తంగా చాలా గ్రామాలకు మధ్య వాగులు, ఏర్లు ఉన్నాయి. వాటిని దాటేందుకు పాలకులు వంతెనలకు బదులు కల్వర్టులు, కాజ్ వేలు నిర్మించారు. అయితే వర్షా కాలం వాగులు, యేర్లు వరద నీరు చేరి ఉప్పొంగి ప్రవహిస్తుంటాయి. వాగులు దాటే క్రమంలో ప్రజలు వణికి పోవాల్సి వస్తోంది. ఏర్పేడు మండలంలోని మునగలపాలెం-గోవిందవరం గ్రామాల మధ్య స్వర్ణముఖి నదిలో నిర్మించిన కాజ్ వే పై ప్రయాణం ప్రమాదకరంగా ఉంటోంది. స్వర్ణముఖికి వరద వచ్చిన ప్రతి సారి కాజ్ వేపై రాకపోకలు స్తంభించిపోతున్నాయి. గ్రామీణ ప్రాంతాల నుంచి తిరుపతికి వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. తొట్టంబేడు మండలంలోని చిట్టత్తూరు వాగు ఉప్పొంగితే సుమారు 25 గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోతాయి. అదేమండలంలోని కారాకొల్లు వాగు ప్రమాదకరమే. శ్రీకాళహస్తి రూరల్ మండలంలోని సున్నపు వాగు పొంగితే కాసారం-చియ్యవరం మార్గాల మధ్య సుమారు 30 గ్రామాలకు రాకపోకలు బంద్. అదేవిధంగా ముచ్చివోలు-వెంకటగిరి మార్గంలోని ఉడమలపాడు వాగు పొంగితే ముచ్చివోలు పరిధిలోని పలు గ్రామాలతో పాటు వెంకటగిరికి వైపు వాహనాల రాకపోకలు స్తంభించిపోతాయి. ఇలా చెప్పుకుంటూ పోతే చాలా గ్రామాల మధ్య వాగులు దాటాలంటే ప్రజలు వణికిపోవాల్సిందే.

### వంతెనలు కట్టరా..!!

ఏర్పేడు మండలంలోని మునగలపాలెం వద్ద స్వర్ణముఖి నదిలో వంతెన నిర్మించాల్సి ఉంది. అయితే పాలకులు కాజ్ వేతో సరిపెట్టేశారు. ఇక్కడ వంతెన కట్టాలని సుమారు 50 గ్రామాల ప్రజలు రెండు దశాబ్దాలుగా అధికారులు, పాలకులకు వినతులు సమర్పించినా బుట్ట దాఖలయ్యాయి. చిట్టత్తూరు వాగుపై వంతెన నిర్మించాలని, లేకుంటే కనీసం కాజ్ వే ఎత్తు అయినా పెంచాలని తొట్టంబేడు-కేవీబీపురం మండలాలకు చెందిన 20 గ్రామాల ప్రజల అభ్యర్థనను పాలకులు పెడ చెవిన పెడుతున్నారు. అదేవిధంగా సున్నపు వాగు, ఉడమలపాడు వాగు, కారాకొల్లు వాగులపై కూడా వంతెనలు కట్టాలన్న ప్రతిపాదనలు ఏళ్ల తరబడి పెండింగ్‌లోనే ఉన్నాయి. ఇదిలా ఉంటే అవసరం లేని చోట వంతెనలు నిర్మించిన పాలకులు అనవసరమైన చోట మాత్రం కోట్లు వెచ్చించి వంతెన నిర్మించారు. పెద్దకన్నలి-డైవేడు మార్గాల మధ్య స్వర్ణముఖి నదిపై రూ. 7 కోట్లు వెచ్చించి వంతెన కట్టించింది అప్పటి టీడీపీ ప్రభుత్వం. అయితే ఆ వంతెన ఉపయోగం కనీసం పది గ్రామాలకు కూడా లేకపోగా, వాహనాల రాకపోకలు కూడా అరుదే. ఇప్పటికైనా పాలకులు స్పందించి వచ్చే వర్షాకాలం లోపైనా ప్రమాదకర వాగులు, ఏర్ల వద్ద వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

## నేడు కౌన్సిల్ సమావేశం

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** తిరుపతి గ్రేటర్ వైపు అడుగులు వేయనుంది. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు తిరుపతిని గ్రేటర్‌గా మార్చాలని ఆదేశాల్లో కమిషనర్ మౌర్యకు సూచించడంతో శుక్రవారం జరగనున్న తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కౌన్సిల్ సాధారణ సమావేశంలో గ్రేటర్‌గా ప్రతిపాదన పెడుతూ అజెండాలు 100 అంశంలో చేర్చడం జరిగింది. కౌన్సిల్ సాధారణ సమావేశంలో మెజార్టీ కార్పొరేటర్లు గ్రేటర్ తిరుపతిని ఆమోదించే అవకాశం ఉంది. తిరుపతి గ్రేటర్‌లో 63 పంచాయతీలు, తిరుపతి రూరల్ 33 పంచాయతీలు, రేణిగుంటలో 21 పంచాయతీలు, చంద్రగిరి నియోజకవర్గంలో 10 పంచాయతీలు, ఏర్పేడు మండలంలోని వికృత మాల వరకు గ్రేటర్ ప్రతిపాదన పెట్టారు. సుమారు 7 లక్షల జనాభా కలిగిన దాన్ని గ్రేటర్‌గా చేయనున్నారు. కౌన్సిల్ సమావేశంలో గ్రేటర్ తిరుపతి అజెండాలో ఆమోదం పొందిన తర్వాత పంచాయతీలకు వారి వారి అభిప్రాయం పంపనున్నారు. వచ్చే ఏడాది జనవరిలో పంచాయతీ పాలకమండలి తీర్మానం ముగియనుంది. దీంతో తిరుపతి గ్రేటర్ పలు పంచాయతీలు కలుపుతూ అన్ని పంచాయతీ కార్యదర్శులకు నోటీసులు జారీ చేయనున్నారు. తిరుపతి గ్రేటర్ ఏఏ పంచాయతీలు చేరతాయో వారి అభిప్రాయాన్ని నెల రోజుల్లో తర్వాత పంపాల్సి ఉంటుంది. కూటమి పర్వతాధికారులు వచ్చిన తర్వాత తిరుపతి గ్రేటర్ గా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలుమార్లు ఉన్నతాధికారులకు ఆదేశించడం జరిగింది. అందులో భాగంగా గ్రేటర్ వైపు పంచాయతీలను విలీనం చేయనున్నారు.

### చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యంతరం

తిరుపతి గ్రేటర్లో చంద్రగిరిలో నియోజకవర్గంలో ఉండే పది పంచాయతీలు కలుపుతూ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు నివేదికను తయారు చేశారు. ఈ విషయం చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దృష్టికి కూడా తీసుకెళ్లడం జరిగింది. శుక్రవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో తిరుపతి గ్రేటర్లో చంద్రగిరి పంచాయతీలు ఇప్పుడే చేర్చవద్దని తాను సీఎంతో మాట్లాడిన తర్వాతే చేర్చాలని మున్సిపల్ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే నాని సూచించినట్టు తెలిసింది. అయితే అజెండాలో చంద్రగిరిలో ఉన్న పంచాయతీలు గ్రేటర్‌లో అజెండాను తయారుచేసి సిద్ధంగా ఉంచడం జరిగింది. ఈ విషయం మున్సిపల్ ఉన్నతాధికారులను అడిగితే సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకే చంద్రగిరి నియోజకవర్గంలో ఉండే పంచాయతీలు గ్రేటర్‌లో చేరుస్తున్నట్టు వెల్లడించారు.

### పనులన్నీ వైసీపీ కార్పొరేటర్లకే

తిరుపతి మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో 108 అంశాలు అజెండాను రూపొందించారు. సుమారు 10 కోట్ల రూపాయలు విలువైన పనులను పెట్టడం జరిగింది. ఇందులో ఎక్కువ పనులు వైసీపీ కార్పొరేటర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులోనే పనులు పెట్టడం పట్ల కూటమి నేతలు కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. కొత్తగా పిలిచే పనులు తమతో చర్చించి ఎందుకు అజెండాలో పెట్టలేదని కూటమి పార్టీకి చెందిన కార్పొరేటర్లు ఇంజనీరింగ్ ఉన్నతాధికారులకు ప్రశ్నించినట్టు సమాచారం. ఇందులో ఎక్కువ పనులన్నీ వైసీపీ కార్పొరేటర్ లో ఉన్న వార్డులో ఎందుకు కేటాయించారని తాము సూచించిన పనులు ఎందుకు చేర్చలేదని ప్రశ్నించడం జరిగింది. అయితే మున్సిపల్ ఉన్నతాధికారులు కార్పొరేటర్లు సూచన మేరకు అత్యవసర పనులు ఉన్నచోట మాత్రమే పనులు పెట్టడం జరిగిందని వారికి సమాధానం చెప్పినట్టు తెలుస్తుంది.

### సమస్యలపై ప్రశ్నించనున్న కార్పొరేటర్లు

ఎస్వి సెనెట్ హాల్లో శుక్రవారం జరుగును కౌన్సిల్ సమావేశంలో కార్పొరేటర్లు ప్రజా సమస్యలపై ప్రశ్నించనున్నారు. ముఖ్యంగా అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మున్సిపల్ కొత్త కార్యాలయం నిర్మాణం పూర్తి నిధులు ఇబ్బందులు, టౌన్ ప్లానింగ్ విభాగం అవినీతిమయం ఇతర సమస్యలపై కార్పొరేటర్లు ప్రశ్నించనున్నారు. గత కౌన్సిల్ సమావేశంలో ఆమోదం పొందిన పనులు ఎందుకు చేయలేదు వాటిని కార్పొరేటర్లు ప్రశ్నించే అవకాశాలు ఉన్నాయి. వర్షాకాలంలో డిఆర్ మహల్ అండర్ గ్రౌండ్‌లో వర్షం నీరు ఆగిపోవడం దాని సమస్య పరిష్కరించాలని వాటితో పాటు టిడిఆర్ బాండ్లు పై అధికారులను నిలదీసే అవకాశం ఉంది.

## వర్షాలకు కూలీన పూరిగుడిసెలు

**ప్రజాశక్తి -బుచ్చినాయుడుకండ్రిగ:** మండలంలో వారం రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నిరుపేదల గుడిసెలు నేలకొరి గాయి. ఏం చేయాలో తెలియక దిక్కు తోచని దిక్కుతోచని స్థితిలో దళిత గిరిజన కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వానకు తడుస్తూ ఈదురు గాలులకు వణుకుతూ ఉన్న ఆ కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని ఆయా గ్రామాల గ్రామస్తులు కోరుతున్నారు. బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో, ఆలత్తూరు గ్రామ దళితవాడలో ఒక పూరి గుడిసె, పట్టాభి గిరిజన కాలనీలో మూడు పూరిగుడిసెలు నేల కూలాయి. పూరి గుడిసెలు కూలీ పోవడంతో మూడు కుటుంబాల గిరిజనులు, దళితులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రాత్రంతా వర్షానికి తడుస్తూ చలి గాలులతో నానా అవస్థలు పడ్డారు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

### ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : ఎస్ హరి ప్రసాద్

భారీ వర్షాలతో మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం పందికాలువ, కారణిఏరు, కాళంగినదులను పరిశీలించారు.

## స్విమ్స్ కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** స్విమ్స్ కార్మికుల సమస్యలు గత మూడు సంవత్సరాలుగా కొనసాగుతూనే ఉన్నాయి. ఈ సమస్యలు పరిష్కారం చేయాలని, పలుదఫాలు అధికారుల చుట్టూ తిరిగినా పరిష్కారం కాలేదు. గురువారం స్విమ్స్ డైరెక్టర్ కార్యాలయం వద్ద కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించి, స్విమ్స్ డైరెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఈ ధర్నానుద్దేశించి, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి సుబ్రహ్మణ్యం, స్విమ్స్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె వేణుగోపాల్, నగర సిఐటియు అధ్యక్ష కార్యదర్శులు పి. బుజ్జి, ఎన్ మాధవ్, ఆనంద్ ప్రసంగించారు. వారు మాట్లాడుతూ స్విమ్స్ ఆస్పత్రిలో 800 మంది కార్మికుల సమస్యలు మూడు సంవత్సరాలుగా కొనసాగుతుంటే యాజమాన్యం పరిష్కరించకుండా చోద్యం చూస్తుందన్నారు. గతంలో సమ్మె చేసినపుడు సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కానీ వారు ఇచ్చిన గడువు పూర్తయినప్పటికీ సమస్యలు పరిష్కారం చేయకపోవడంతో ధర్నా నిర్వహించినట్లు తెలిపారు. ధర్నా అనంతరం స్విమ్స్ డైరెక్టర్, మెడికల్ సూపరింటెండెంట్, టీటీడీ అకౌంటెంట్, కార్మికులు చేస్తున్న ధర్నా వద్దకు వచ్చి ఈ సమస్యపై కమిటీ ఏర్పాటు చేయడం జరిగిందని, వారు టిటిడికి రిపోర్టు ఇచ్చారని ఈ సమస్య చివరి దశలో ఉందని తెలిపారు. త్వరలో సమస్యలు పరిష్కరిస్తామని, శానిటేషన్ పదాన్ని తొలగించి కార్మికులకు న్యాయం చేస్తామని, సమ్మె కాలం డిమాండ్లన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వారిచ్చిన హామీతో ధర్నా విరమించారు. ఈ సమస్య త్వరగా పరిష్కరించకపోతే మరో పోరాటానికి శ్రీకారం చుట్టాల్సి వస్తుందని సిఐటియు నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి జి రవి, అధ్యక్షులు వి సూరి, కోశాధికారి మారి ముత్తు, నాయకులు గోపి, రత్న వేలు, జనార్ధన్, కోటయ్య, జయమ్మ, కుమారి, ఎం సుబ్బు యాదవ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

## తుడా చైర్మన్‌కు కువైట్ తెలుగు కళా సమితి స్వాగతం

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** కువైట్‌లో తెలుగు కళాసమితి వారు నిర్వహిస్తున్న మెగా ఈవెంట్‌కు ముఖ్య అతిథిగా రెండు రోజుల పర్యటన నిమిత్తం కువైట్‌కు విచ్చేసిన తుడా చైర్మన్, తితిదే ఎక్స్ అఫిషియో మెంబర్ డాలర్స్ దివాకర్ రెడ్డికి కువైట్ విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. కువైట్ తెలుగు కళాసమితి సభ్యులు, తెలుగుదేశం, జనసేన నాయకులు దివాకర్ రెడ్డిని ఆప్యాయంగా పలికించారు. తుడా చైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి కువైట్‌లో రెండు రోజులు పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు.

## వన్ టౌన్ సీఐ గా ప్రకాష్ కుమార్

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** శ్రీకాళహస్తి వన్ టౌన్ సీఐగా ప్రకాష్ కుమార్ గురువారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేసిన గోపి వీఆర్‌కు వెళ్లారు. ఆయన స్థానంలో తిరుపతి క్రైమ్ బ్రాంచి సీఐగా పనిచేస్తున్న ప్రకాష్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో శాంతిభద్రతల పర్యవేక్షణలో రాజీపడకుండా పని చేస్తానని సీఐ తెలిపారు.

## ఓట్ల అవకతవకలపై మరింత పోరాడాలి

**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :** ఓట్ల అవకతవకలపై ప్రజాక్షేత్రంలో మరింత పోరాటాలు సాగించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి శ్రేణులకు సూచించారు. గురువారం జిల్లా కాంగ్రెస్ పార్టీ నేతలు షర్మిలను కలిసి ఓట్ చోర్ గడ్డి చోడ్ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సంతకాల సేకరణ ప్రతులను అందజేశారు. 81881 మంది ఓటర్ల చేత వారి అభిప్రాయాలతోటి సంతకాల సేకరణ చేసినట్లు డిసిసి అధ్యక్షులు బాలగురవం బాబు, శ్రీకాళహస్తి నియోజక వర్గం సమన్వయకర్త తలపా దామోదర్ రెడ్డి తెలిపారు.

## అనారోగ్యంతో ముగ్గురు మృతి

**ప్రజాశక్తి - తిరుపతి సిటీ:** తిరుపతి రుయా ఆసుపత్రి ప్రాంగణంలో 60, 65, 55 సంవత్సరాల వయసు ఉన్న ముగ్గురు మృతి చెందిన ఘటన గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రుయా ఆసుపత్రి ప్రాంగణంలో ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు అనారోగ్యంతో మృతి చెందారని తెలిపారు. మృతుల వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులుగా నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాలను రుయా మార్చురీకి తరలించినట్లు తెలిపారు. మృతులను గుర్తించిన వారు తిరుపతి వెస్ట్ పోలీసులను సంప్రదించాలని కోరారు.

## పాకాలలో 26న చెస్ పోటీలు

**ప్రజాశక్తి - పాకాల:** మండల స్థాయి చెస్ పోటీలు ఈ నెల 26వ తేదీ, ఆదివారం నిర్వహిస్తున్నట్లు లయన్స్ క్లబ్ ఆఫ్ పాకాల అధ్యక్షుడు పోతుగుంట అనీల్ తెలిపారు. దామలచెరువు గ్రామం, మంగినాయనపల్లెలో గురువారం ఉదయం జరిగిన బోర్డ్ ఆఫ్ డైరక్టర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ఆఫ్ పాకాల, సత్యం చారిటబుల్ ట్రస్ట్, సహచర సమాంతర ఆలోచనల సామాజిక వేదిక సంయుక్త ఆధ్వర్యంలో జరగనున్న ఈ పోటీల్లో పాకాలతో పాటు చుట్టుపక్కల మండలాలలో చదువుతున్న విద్యార్థులు పాల్గొనవచ్చునని చెప్పారు.

## కల్తీ మద్యం పాపం జగన్‌దే : కురుగొండ్ల

**ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్:** తాడేపల్లి ప్యాలెస్ నుంచే కల్తీ మద్యం కుట్రలు పుట్టుకొచ్చాయని, టీడీపీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ సంచలన ఆరోపణలు చేశారు. గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన, మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డిపై విమర్శలు గుప్పించారు. జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని లిక్కర్ మాఫియా రాజ్యంగా మార్చారని, 3,500 కోట్లు దోచుకున్నారని ఆరోపించారు. జే బ్రాండ్స్ పేరుతోనే మద్యం విక్రయాలు జరిగాయని ఆరోపించారు. దీని ఫలితంగా రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది అమాయకులు చనిపోయారని, మరో 30 లక్షల మంది కల్తీ మద్యం వల్ల అనారోగ్యానికి గురయ్యారని మండిపడ్డారు. తనకు భూ ఆక్రమణలతో సంబంధం ఉందని వైసీపీ నేతలు చేస్తున్న ఆరోపణలను ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు, చేనేత రాష్ట్ర డైరెక్టర్, తిరుపతి పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి, రాష్ట్ర, నియోజకవర్గ అనుబంధ కమిటీ సభ్యులు, పట్టణ కమిటీ సభ్యులు, బాలాయపల్లి రూరల్ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాలోత్సవం నవంబర్ 1,2 తేదీలకు మార్పు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** 25, 26 తేదీల్లో జరగాల్సిన తిరుపతి బాలోత్సవం 4వ పిల్లల పండుగను భారీ వర్షాల కారణంగా నవంబర్ 1,2 తేదీలకు మార్పు చేశారు. బాలోత్సవ ఏర్పాట్లు పూర్తయినట్లు నిర్వాహకులు తెలిపారు. 160 పాఠశాలల నుండి 10 వేల మందికి పైగా విద్యార్థులు పోటీలలో పాల్గొనడానికి పేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. 200 మందికి పైగా ఆర్గనైజర్లు, న్యాయనిర్ణేతలు సిద్ధమైనారన్నారు. పాఠశాల యాజమాన్యాలు, తలిదండ్రులు ఈ మార్పునున గమనించాలని కోరారు.

## ఓవరాల్ ఛాంపియన్ షిప్ కైవసం

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల విద్యార్థినిలు 21 నుండి 23 వరకు విజయవాడలో జరిగిన 69వ ఆంధ్రప్రదేశ్ ఎస్‌జిఎఫ్ అండర్-19 అంతర్-జిల్లా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్-2025లో రాణించి, ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ భువనేశ్వరి తెలిపారు. ఆమె మాట్లాడుతూ 13 జిల్లాల పోటీలో ఛాంపియన్ షిప్ కైవసం చేసుకోవడం ఎంతో గర్వకారణమని విద్యార్థినిలను, ఫిజికల్ డైరెక్టర్ సాయి సుమతిని అభినందించారు. పతకాల విజేతలు: ఆర్. లక్ష్మీ లావణ్య - సీనియర్ సి ఇ సి - బంగారు పతకం, కె. రెడ్డి జీవన - సీనియర్ హెచ్ ఇ సి -వెండి పతకం, వైష్ణవి- సీనియర్ సిఇసి-వెండి పతకం, శశిరేఖ-సీనియ ర్ సిఇసి - కాంస్య పతకం సాధించారు.

## వీసీని కలిసిన నారాయణ గౌడ్

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం నూతన ఉపకులపతి బాధ్యతలు చేపట్టిన ఆచార్య నరసింగ రావును ఆంధ్ర ప్రదేశ్ బీసీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పర్చూరు నారాయణ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువతో సన్మానించారు. యూనివర్సిటీలో విద్యార్థులకు అవసరమైన వసతులు కల్పించే విధంగా చర్యలు చేపట్టాలని, పరీక్షా ఫలితాలను త్వరితగతిన విడుదల చేయాలని విద్యార్థులకు ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టాలని విసి ని కోరారు. వీరి వెంట వినయ్, తేజ, గంగాధర్, రమణ, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

**మహా రాజ రాజశ్రీ గౌరవనీయులైన అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, తిరుపతి.**
**ఐ.ఎ.నెం.235/2025,**
**క్రెడిటర్ ఐ.పి. నెం.42/2024**
కె.వి.శివ కుమార్, S/o కె. విశ్వనాథన్, ఉద్యోగి, ఇంటి నెం.20-2-472/2బి/8, మారుతి నగర్, కొర్లగుంట, తిరుపతి. ... పిటిషనర్
Vs
సి.వి.హరి రావు మరియు ఇతరులు ...రెస్పాండెంట్స్
**Notice to the Respondent No 1**
సి.వి.హరి రావు S/o సి.వి.రామా రావు, డోర్ నెం. 22-18-19/హెచ్, వార్డునెం..22, గరుడాద్రి నగర్, రెడ్డి భవన్ ప్రక్కన, తిరుపతి.
పై దావానందు పై పేర్కొన్న సి.వి.హరి రావు 1వ రెస్పాండెంట్‌గా యుండి కోర్టు సమన్లు అందజేయుటకు అందుబాటులో లేనందున పై గౌరవ కోర్టు వారు తేది.10.09.2025న ఐ.ఎ.నెం.235/2025, క్రెడిటార్ ఐ.పి.42/2024 పత్రికా ప్రకటన ద్వారా పై దావా సమాచారాన్ని రెస్పాండెంట్కు తెలియపరచమైనది. తదుపరి నాయిదా తేది.03.11.2025.
పై పేర్కొన్న ప్రతివాది సి.వి. హరి రావు తేది. 03.11.2025న ఉదయం 10.30 గంటలకు పై పేర్కొన్న కోర్టు వారి ముందు హాజరు కావలెనని లేదా వారి తరపు న్యాయవాది హాజరు కావలెనని మరియు మీ ఆక్షేపణలు తెలుపగలరు. అట్లు హాజరు కానిచో కోర్టు వారు తీసుకొను చట్టపరమైన చర్యలకు బాధ్యులగుదురు.
**(కోర్టు వారి ఉత్తర్వులు)**
**వాయిదా తేది. 03.11.2025**
**పి.సురేష్ బాబు, యన్.భార్గవ,**
న్యాయవాదులు, డి.నెం.13-7-906సి, కొర్లగుంట మెయిన్ రోడ్, తిరుపతి 517 501, సెల్ నం.9440256731, 9493880753

**In The Court of the VII Addl. District Judge : Gudur**
**E.P. No. 153 / 2022**
**ARC No.MF/ARB/09/2021**
**M/s. Mahaveer Finance Ltd.,** having its Reg. Office at K.G.Plaza, 41-44, T8/T9, 3rd Floor, G.P.Road, Chennai-600002, Rep.by its Authorized Person Cum Branch Manager, **I.Sanjay Kumar** - Award Holder
Vs
**1. M.Venkatachalam**
**2. Dasari Dasaratha** - Jdrs
**వేలం ప్రకటన**
పై నెంబరున అవార్డు హోల్డర్ డిక్రీ బాకీ రాబట్టు కొనుటకు 1వ జె.డి.ఆర్ తాలూకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని **తే05-11-2025దిన ఉదయం 10.30 గంటల** నుండి **సాయంత్రం 5 గంటల** లోపల పై తెలిపిన కోర్టులో బహిరంగ వేలం పాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలంపాటలో పాల్గొని పాటపాడుకొనవచ్చును.
**SCHEDULE OF PROPERTY**
Sri Potti Sriramulu Nellore District - Gudur Registration District - Kota Sub Registration - Kota Mandal- Kota Panchayath- Kota Bit-1 Village - West Street, Near to the Door No. dry land survey No.1471-4c an extent of Ac.0-26 cents out of 62 Ankanams site in that an extent of 31 ankanams of site within the following **boundaries: East :** Land belongs to Kodavaluru Janakirami Reddy to some extent and Nallapareddy Srinivasulu Reddy land to Some extent with measurement 48 feet. **South:** Compund wall of Nallapareddy Srinivasulu Reddy - measurement 42 feet, **West :** Road with measurement 47 feet, **North:** Land belongs to Valagati Leelavathi - measurement 52 feet. with all easementary rights.
**DHR Value of Rs.3,00,000/-**
**Amin Value of Rs.6,20,000/-**
**Market Value of Rs.8,68,000/-**
**వి.జయరామారావు,** బి.ఎ., బి.ఎల్., అవార్డు హోల్డర్ తరపు అడ్వకేట్, నెల్లూరు.

**IN THE COURT OF THE XII ADDL DIST JUDGE SRIKALAHASTI**
**L.A.NO. 711/2025**
**O.S.No. 97/2023**
**Between**
M.Venkata Subbaraju ... **Plaintiff**
**And**
V. Babu Reddy ...**Defendants**
**Notice to R3 to R6**
**To**
**R3:** Venati Raghava Reddy S/o V.Chenga Reddy aged about 59 years.
**R4:** Venati Siresha W/o. Raghava Reddy, aged about 46 years
**R5:** Venati Lasya D/o. Raghava Reddy aged about 25 years
**R6:** Venati Tharani D/o. Raghava Reddy 23 years
నివాసం డోర్ నెం.1-99, పులివల్లం విలేజ్, వరదయ్యపాళెం మండలం, తిరుపతి జిల్లా.
పై దావాలో మిమ్మల్ని R3 to R6 ప్రతివాదులుగా చేర్చినట్లుగా తెలియపరచడమైనది. ఇందులో మీకు ఎలాంటి అభ్యంతరములు వున్న యెడల తేది 27.10.2025న ఉదయం 10:30 గం॥లకు మీరు ప్రత్యక్షముగా గానీ, లాయరుద్వారా గానీ పై కోర్టులో హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనగలరు. లేనంతట పై విషయమై మీ పరోక్షమున తీర్మానించబడును.
**వాయిదాతేదీ: 27.10.2025**
**G.SEKHAR,** M.A., B.L., Advocate, Srikalahasti

**మహారాజశ్రీ తిరుపతి ప్రిన్సిపాల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో**
**యస్.ఓ.పి.నెం.03 ఆఫ్ 2025**
మైనరు ముక్కు చరణ్ తేజ తండ్రి లేట్ నరసింహులు మైనరుకు గార్డిన్ ముక్కు సుజాత భర్త లేట్ సుధాకర్ డి.నెం.18-1-652, భవానీ నగర్, తిరుపతి టౌన్ ..పిటిషనరు
మరియు
యస్.బి.ఐ. లైఫ్ ఇన్సూరెన్స్ కో-లిమిటెడ్ బ్రాంచి ఆఫీసు, డి.నెం. 19-3-13/ఎం., హీరో హోండా షోరూమ్ దగ్గర, 3వ అంతస్తు, రేణిగుంట రోడ్డు, తిరుపతి టౌన్ ...రెస్పాండెంట్
**జనరల్ నోటీసు టు పబ్లిక్**
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా ముక్కు నరసింహులు, ముక్కు సుధాకర్ అన్నదమ్ములుగా వుంటున్నారు. ముక్కు నరసింహులు గారు పై కనిన మైనరు ముక్కు చరణ్ తేజను, అతని ఒరిజినల్ తల్లి తండ్రులు అయిన ముక్కు సుజాత, ముక్కు సుధాకర్ దగ్గర నుండి 30.11.2017వ తేది రిజిష్టర్ అడాప్షన్ డీడ్ నెం. 199 ఆఫ్ 2017 ద్వారా తన కుమారుడుగా స్వీకరించియున్నారు. సదరు ముక్కు నరసింహులు గారు లైబ్రేరియన్‌గా పనిచేస్తూ... రిటైర్ అయిన తరువాత 22.02.2025వ తేది ఆరోగ్యము సరిగా లేనందున చనిపోయినాడు. అతను చనిపోయిన తరువాత అతని తమ్ముడు ముక్కు సుధాకర్ గారు 10.03.2025వ తేది చనిపోయివడు. సదరు ముక్కు నరసింహులు గారు తను బ్రతికి వున్నప్పుడు ద్రాక్షాయని అను ఆమెను వివాహము చేసుకొని, చట్టబద్ధముగా కోర్టు ద్వారా విడాకులు తీసుకొని యున్నాడు. కావున సదరు ముక్కు నరసింహులుకు సదరు మైనరు ముక్కు చరణ్ తేజ తప్ప వేరే ఎవ్వరును వారసులు లేరు. సదరు ముక్కు నరసింహులు బ్రతికి వున్నప్పుడు రెస్పాండెంట్ బ్యాంకు నందు ఎస్.బి.ఐ. లైఫ్ రిటైర్‌మెంట్ స్మార్ట్ - VIDE నెం. 1H743218008 వేసియున్నాడు. సదరు పాలసి నందు తన తమ్ముడు ముక్కు సుధాకర్‌ను నామినిగా పెట్టియున్నాడు. సదరు ముక్కు సుధాకర్ గారు 10.03.2025 వ తేది చనిపోయినాడు. సదరు ముక్కు నరసింహులు, ముక్కు సుధాకర్ ఇరువురు చనిపోయిన తర్వాత సదరు మైనర్ పిటిషనరు ముక్కు చరణ్ తేజ, మరియు అతని తల్లిగారైన ముక్కు సుజాత గారు పై రెస్పాండెంట్ బ్యాంకు లైఫ్ ఇన్సూరెన్స్ కో-లిమిటెడ్ తిరుపతి వారి దగ్గరకు పోయి, పై పిటిషనరుకు లైఫ్ ఇన్సూరెన్స్ పైకము ఇవ్వమని కోరగా సదరు లేట్ ముక్కు నరసింహులుకు వారసులుగా పైకము తీసుకొనుటకుగాను కోర్టు ద్వారా SUCCESSION సర్టిఫికెట్ కావలెనని కోరియున్నారు. అందుపై పై పిటిషన్‌ను పై పిటిషనరు వేసియున్నారు.
కావున కోర్టువారు పై మైనరు పిటిషనరుకు గార్డియన్‌గా ముక్కు సుజాత గారికి, సదరు లేట్ ముక్కు నరసింహులు గారు రెస్పాండెంట్ బ్యాంకు నందు ఎస్.బి.ఐ. లైఫ్ రిటైర్‌మెంట్ స్మార్ట్ VIDE నెం. 1H743218008 పాలసీ ద్వారా రావలసిన పైకము తీసుకొనుటలో ఎవరికైనను ఎటువంటి అభ్యంతరములు వున్నయెడల 10.11.2025వ తేది పై కనిన కోర్టుకు ఉదయం 10.30 గం॥లకు నేరులో నైనను, వకీలు ద్వారా అయినను హాజరై మీకుగల అభ్యంతరములు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షముగా తీర్మానించబడును.
**వాయిదా తేది. 10.11.2025**
**వెల్లూరు భాస్కర్,** పిటిషనర్ల తరపు న్యాయవాది, తిరుపతి. సెల్: 9502784577

**BEFORE THE MOTOR ACCIDENTS CLAIMS TRIBUNAL AT PONNERI**
**(IN THE COURT OF PRINCIPAL SUB-JUDGE, PONNERI)**
**M.C.O.P.No.181 of 2024**
R.Archana ...**Petitioner**
**-Vs-**
Munirathinam Mudaliar and another ...**Respondent**
**NOTICE**
R-1, MUIRATHINAM MUDALIAR, S/o.Mudalianda Mudaliar, No.5/148, NGO Colony, Puttur, Chittoor District, Andhra Pradesh - 517583. ...**1st Respondent**
Take notice that the above said MCOP No.181 of 2024 has filed by the petitioner for the compensation of the injuries sustained in a road accident occurred on 09.02.2024. That the above MCOP is posted for 1st respondent's appearance on 05.12.2025 at 10.15.A.M, on that da y the 1st respondent is appear in person or his counsel and must be present before the Hon'ble Motor Accidents Claims Tribunal Ponneri at Hon'ble Principal Sub-Judge at Ponneri, or otherwise the above MCOP is decided as against you.
**V.AMMARATH GANDHI**
Counsels for petitioners

**IN THE COURT OF THE ADDITIONAL SUBORDINATE JUDGE,VELLORE.**
**MCOP NO: 6/2025**
Karthik,S/o.V.Ravi. ....Petitioner
**Vs**
R1. Veerakanolu Sridevi, W/o.B.Murali, Residing at No. 04-10-S3-35-1, Nehru Nagar, Tirupati Urban, Near Ramakrishna Del Tirupati Urban, Sri Balaji, Andhra Pradesh-517501 ....Respondent
**NOTICE TO RESPONDENT**
The above petitioner in the above MCOP case claiming compensation from the Respondents of you. If any objection from your side you or your counsel may attend before the Honourable Additional Subordinate Judge, Vellore 632009 on **14.11.2025 at 10.00 AM.** It is further informed, that if not, the case will be decided as EX-Parte.
**N.SANKAR**, Advocate, Sathuvachari, Vellore 632 009

**IN THE COURT OF THE ADDITIONAL CIVIL JUDGE (SENIOR DIVISION) TIRUPATI**
**I.A.NO. 648, 649, 650 / 2023**
**I.A.NO. 582/2022, O.S.NO. 319/2005**
P. Sobha Rani ...Petitioner/Plaintiff
Vs.
P.Kanjakshula Reddy and others ...Respondents/Defendants
**Notice to the Respondents No. 10 to 12**
R10) P.Subba Lakshmi W/o P.Renukarjuna Reddy
R11) P.Swetha W/o T.Kishore Redddy
R12) P.Sreelatha D/o Late Renukarjuna Reddy
Respondents No. 10 to 12 are residing at Thataiah Kaluva Village, Elamandyam Post, Renigunta Mandal, Tirupati District.
Please take notice that the above suit i.e., I.A.No. 648, 649, 650 of 2023, I.A.No. 582 of 2022, O.S.No.319 of 2005. Is Posted to 10.11.2025 for your appearance. You are threfore directed by the above said Hon'ble Court to attend on 10.11.2025 at 10.30 AM and represent the matter either in person or through your advocate. Failing which the matter will be decided exparte.
//by order of the court//
**L.MADHUSUDHAN REDDY**
Advocate Tirupati. Cell: 9848175467

## జ్యోతికి మేరిగ మురళీధర్ నివాళి

**ప్రజాశక్తి -కోట :** కోట పట్టణంలో పర్టీలైజర్స్ వ్యాపారి రామిరెడ్డి కోటారెడ్డి కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ పరామర్శించారు.కోటారెడ్డి సతీమణి జ్యోతి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె గూడూరు రూరల్ మండలం వైయస్సార్ సిపి నాయకుడు రాధాకృష్ణారెడ్డి సోదరి కావడంతో వారి నివాసానికి విచ్చేసి ఎమ్మెల్సీ మేరీగ మురళీధర్ జ్యోతి చిత్రపటానికి నివాళులర్పించారు.అనంతరం కోటారెడ్డి, రాధాకృష్ణారెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్సీ వెంట మండల కన్వీనర్ పలగాటి సంపత్ కుమార్ రెడ్డి,యరటపల్లి.మధు సూదన్ రెడ్డి,పాపారెడ్డి.శశీధర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## పేదలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా : ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

**ప్రజాశక్తి - తిరుపతి టౌన్:** సీఎంఆర్ ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు గురువారం ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందచేశారు. 12వ డివిజన్ కెనడీనగర్ కు చెందిన మల్లిశెట్టి కుమారికి రెండు లక్షలా ఇరవై వేలు మంజూరు కాగా ఆ చెక్కును ఆమెకు ఎమ్మెల్యే అందించారు. మూడవ డివిజన్ పోస్టల్ కాలానికి చెందిన గంగాధర్ రెడ్డి కి రెండు లక్షల డెబ్బై ఏడువేల తొమ్మిది వందల యాభై నాలుగు వేల రూపాయలు మంజూరు కాగా ఆ చెక్కును ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గంగాధర్ రెడ్డి భార్యకు అందించారు. అలాగే 5వ డివిజన్ మారుతీనగర్ కు చెందిన మువ్వాల వాసుకు లక్షా పదారు వందలా అరవై ఏడు రూపాయలు రాగా ఆయన కుమారుడు వాసు కు చెక్కు ఎమ్మెల్యే అందించారు. పేద, మధ్యతరగతి ప్రజలు అనారోగ్యానికి గురై వైద్యానికి అధిక మొత్తం చెల్లించి ఇబ్బంది పడుతుండటాన్ని చూసి ఇంటికి పెద్ద కొడుకుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సీఎం సహాయ నిధి నుంచి నిధులు విడుదల చేస్తూ అందుకుంటున్నారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాజా రెడ్డి,నీలాద్రి, జేకే రాయల్ పాల్గొన్నారు.

## శ్రీ కపిలేశ్వరాలయంలో ముగిసిన గణపతి హోమం

## పుట్టగొడుగుల పెంపకంపై పరిశోధన

**ప్రజాశక్తి - క్యాంపస్ :** భారత వ్యవసాయ పరిశోధనా మండలి ఆధ్వర్యంలో జాతీయ పుట్టగొడుగుల పరిశోధన కేంద్రం ద్వారా శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల నందు పుట్టగొడుగుల పెంపకంపై పరిశోధన కేంద్రం ను 2014 సంవత్సరం నుంచి నిర్వహిస్తున్నట్టు ఎన్జీరంగా వర్సిటీ ఇన్చార్జి ఉపకులపతి డాక్టర్ ఆర్ శారద జయలక్ష్మి దేవి తెలిపారు. పుట్టగొడుగుల జాతీయ పరిశోధన కేంద్రం డైరెక్టర్ డాక్టర్ వి.పి శర్మ తో కలిసి తిరుపతి శ్రీ వేంకటేశ్వర వ్యవసాయ కళాశాల నందు ఏర్పాటుచేసిన పుట్టగొడుగుల పరిశోధన కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి ఉపకులపతి మాట్లాడుతూ 2014 సంవత్సరం నుంచి ఈ పరిశోధన కేంద్రం ద్వారా రైతులకు, యువకులకు గ్రామీణ మహిళలకు శిక్షణతో పాటు స్వయం ఉపాధిగా పుట్టగొడుగుల పెంపకాన్ని ఎంచుకున్న యువతకు సలహాలు సూచనలు అందిస్తున్నామని తెలిపారు. పుట్టగొడుగులలో 35 శాతం ప్రోటీన్ ఉంటుందని మన రాష్ట్రంలో బటన్ ఆయిస్టర్ పాల పుట్టగొడుగులను ఎక్కువగా వాడుతున్నారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పుట్టగొడుగుల పెంపకానికి ఎంతో అనుకూలంగా ఉంటుందని, యువత ఈ రంగంలో స్వయం ఉపాధి పొందడంతో పాటు దీనిని ఒక వ్యాపారంగా నిర్వహించడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని అన్నారు. ఇక్కడి పుట్టగొడుగుల పరిశోధన కేంద్రం నందు విత్తన ఉత్పత్తి ( స్పాన్ )కూడా చేపట్టడానికి గల అవకాశాలను పరిశీలిస్తున్నామని తెలియజేశారు. అనంతరం జాతీయ పుట్టగొడుగుల పరిశోధన కేంద్రం, సోలాన్, హిమాచల్ ప్రదేశ్, డైరెక్టర్, డాక్టర్ విపి శర్మ మాట్లాడుతూ భారతదేశంలో ప్రస్తుతం సంవత్సరానికి నాలుగు లక్షల టన్నుల పుట్టగొడుగుల ఉత్పత్తి జరుగుతుందని పుట్టగొడుగుల ఉత్పత్తిని పెంచడానికి వాతావరణ పరంగా ఆంధ్ర రాష్ట్రం ఎంతో అనుకూలమైనదని ఈ సాగును చేపట్టడానికి అధిక స్థలం అవసరం లేదని మరియు తక్కువ పెట్టుబడి తో వ్యవసాయ వ్యర్థాలను వినియోగించుకొని స్వయం ఉపాధిగా చేపట్టవచ్చని ఈ రంగంలో యాజమాన్యులుగా ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయని తెలిపారు. పుట్టగొడుగులకు ఉన్న గణనీయమైన పోషక విలువల కారణంగా ఇది మధుమేహ వ్యాధిగ్రస్తులకు, విటమిన్ బి12 డి విటమిన్ పుష్కలంగా ఉండడం వలన మరియు కొన్ని రకాల పుట్టగొడుగులకు ఉన్న ఔషధ గుణాల వలన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పుట్టగొడుగుల సాగుకు విస్తృతమైన అవకాశాలు ఉన్నాయని అందువలన తిరుపతి వ్యవసాయ కళాశాల నందు గల స్వచ్ఛంద పరిశోధనా కేంద్రాన్ని ప్రధాన పరిశోధన కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రతిపాదనను సిద్ధం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా పుట్టగొడుగులపై జరుగుతున్న పరిశోధనలను క్షుణ్ణంగా పరిశీలించి తగు సూచనలను ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం రెడ్డి శేఖర్, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డాక్టర్ వి సుమతి, అధ్యాపక, పరిశోధన సిబ్బంది పాల్గొన్నారు.

## ఆధార్ శిబిరాలను సద్వినియోగం చేసుకోండి

### జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి నారాయణరెడ్డి

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** ఆధార్ ప్రత్యేక శిబిరాల కొనసాగింపులో భాగంగా గ్రామ వార్డు సచివాలయాల విభాగం పాఠశాలల్లో ప్రత్యేక ఆధార్ శిబిరాలను నిర్వహించాలని నిర్ణయించిందని గ్రామ వార్డు సచివాలయాల జిల్లా అధికారి జీవి నారాయణరెడ్డి ఓ ప్రకటన తెలిపారు. ఈ మేరకు జిల్లా కలెక్టరేట్లోని గ్రామ వార్డు సచివాలయాల కార్యాలయంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మున్సిపల్ కమిషనర్లతో జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తగిన సూచనలు చేశామన్నారు. ముఖ్యంగా పెండింగ్లో ఉన్న బయోమెట్రిక్ నవీకరణ పై దృష్టి సారించామని, తిరుపతి జిల్లాలోని 136 పాఠశాలల్లో 48743 మంది పిల్లలు తమ ఆధార్ కార్డు బయోమెట్రిక్ లను నవీకరించాల్సిన అవసరం ఉందని, ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకోవడానికి తప్పనిసరి అన్నారు. జేఈఈ, నీట్ ఇతర ప్రవేశ పరీక్షలకు, పోటీ పరీక్షలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి ఆధార్ బయోమెట్రిక్ నవీకరించడం ముఖ్యమైన అంశం అన్నారు. ఈ నెల 23 తేదీ నుంచి 30వ తేదీ వరకు ఆధార్ నవీకరణ జరుగుతుందన్నారు. ప్రత్యేక ఆధార్ శిబిరాల ఏర్పాటులో భాగంగా జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాల మేరకు పిల్లల లైన్ జాబితాలను సంబంధిత మండలాలకు పంపించడం జరిగిందన్నారు. ప్రత్యేక ఆధార్ శిబిరాల నిర్వహణ కోసం అవసరమైన అన్ని వస్తువులను సమకూర్చుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి కె వి ఎన్ కుమార్ కు తగిన మార్గదర్శకాలు ప్రభుత్వం నుండి చేరాయన్నారు. ప్రత్యేక ఆధార్ శిబిరాల కోసం సేవలు అందించడానికి కేటాయించబడ్డ మహిళా పోలీసులను మరి ఇతర సేవలకు నియమించవద్దని ప్రభుత్వం సూచించిందన్నారు.

## ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):** తిరుపతి జిల్లాలో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను పెంపొందించడానికి ప్రత్యేకంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. గురువారం డిఆర్డిఏ కార్యాలయంలో రైతు మాస్టర్ ట్రైనర్స్ కు రెండు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా పిడి శోభన్ బాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయానికి కావలసినటువంటి ఆర్థిక సహాయాన్ని సెర్ప్ ద్వారా రుణాల రూపంలో అందిస్తున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళలు ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో మునగా సాగు చేసినట్లయితే హార్టికల్చర్ విభాగం ద్వారా సబ్సిడీ నగదును ఇస్తూ మార్కెటింగ్ కు మంచి డిమాండ్ ఉండడం వల్ల రైతుకు ఎక్కువ ఆదాయం వస్తుందని తెలిపారు. ప్రతి మహిళ వారి ఇంటి దగ్గర కిచెన్ గార్డెన్స్ ఏర్పాటు చేసుకోవడం వలన ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండినటువంటి ఆహార ఉత్పత్తులు పండించడం, తినడం ద్వారా మంచి ఆరోగ్యం పొందే అవకాశం ఉందన్నారు. కొన్ని ప్రకృతి వ్యవసాయ రకాలను ఎక్కువ మంది రైతులు తమ గ్రామాలలో విస్తరింప చేయడానికి రైతు మాస్టర్ ట్రైనర్స్ ఎంపిక చేసిన వారికి ఆరు నుండి పదిమంది ఐసిఆర్పిను మ్యాప్ చేసి క్యాడర్ సొంత పొలాల్లో నూతన రకాలను పండించేలా తగిన తర్ఫీదును ఇవ్వడం జరుగుతోందన్నారు. డిపిఎం షణ్ముగం ప్రకృతి వ్యవసాయ రకాల సేద్యం ద్వారా కలిగే లాభాలను క్షుణ్ణంగా శిక్షణ కార్యక్రమంలో వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో అదనపు డిపిఎం పట్టాభి రెడ్డి, రవిచంద్ర ప్రసాద్, ఎస్ఆర్పి భానుమూర్తి సిబ్బంది పాల్గొన్నారు.

## రాఘవులు నాయుడికి నివాళి

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం ఆర్థిక శాస్త్ర విభాగంలోని విశ్రాంత ఆచార్యులు, మాజీ విభాగాధిపతి, బిఓఎస్ ఛైర్పర్సన్, సిడిసి సభ్యులుగా సేవలందించిన రాఘవుల నాయుడు అనారోగ్యంతో మూడు రోజుల ముందట మృతి చెందారు. ఆయనకు ఘన నివాళు లు అర్పిస్తూ ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో గురువారం సంతాప సభ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎకనామిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ కె. రాధిక, బిఓఎస్ ఛైర్పర్సన్ ప్రొ. ఆర్.సునీత లు మాట్లాడుతూ రాఘవులనాయుడు సేవలు మరువలేనివని, విభాగ అభివృద్ధికి ఆయన చేసిన కృషి విశేషమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్స్, క్లర్క్ గుణ, పరిశోధక విద్యార్థి అశోక్, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

## జాతీయ సదస్సు బ్రోచర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి - క్యాంపస్ :** శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో గణితశాస్త్ర విభాగంలో డిసెంబరు నెల 22,23,24 తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి సదస్సు బ్రోచర్ను ఉపకులపతి ఆచార్య తాతా నరసింగరావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు ఆవిష్కరించారు. " నేషనల్ కాన్ఫరెన్స్ ఆన్ మాథమాటిక్స్ అండ్ ఇంజనీరింగ్ అప్లికేషన్స్-2025"అంశంపై జరగబోవు సదస్సులో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చునని శాఖాధిపతి ఆచార్య జయసుబ్బారెడ్డి తెలిపారు. ఈ సదస్సులో కీలకోపన్యాసం ఆంధ్రా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జిపి రాజశేఖర్ చేస్తారని నిర్వాహకులు అన్నారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆచార్య ఓవియస్ రెడ్డి, ఆచార్య భారతి, ఆచార్య సుధాకరయ్య, అకడమిక్ కన్సల్టెంట్స్ పాల్గొన్నారు.

## పాడి రైతులకు సూచనలు

**ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ:** మండలంలోని భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా మండలంలోని వాతావరణ శాఖ ఇస్తున్న సమాచారం ప్రకారం బంగాళాఖాతంలో అల్పపీడనం వాయుగుండంగా మారి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వారు తెలియజేయడం జరిగినది. ఈ సందర్భంగా పశుసంవర్ధక శాఖ అధికారులు పాడి రైతులకు సూచనలు చేశారు. ఆవులను, మేకలు, గొర్రెలను మేపడానికి దూరంగా తీసుకు వెళ్ల వద్దని ఇంటి వద్ద గాని లేదా ఊరి పొలిమేరల్లో మాత్రమే మేపాలని తెలిపారు. ముఖ్యంగా కాలువ గట్టు ప్రాంతాలలో, చెరువుల్లో గాని, అదేవిధంగా పెద్ద కాలువలు దాటి అటుపైన మేపడానికి తీసుకు వెళ్లవద్దని తెలియజేశారు. అదేవిధంగా పాత పశువుల కొట్టాలలో పశు వులను, చిన్న జీవాలను ఉంచరాదన్నారు. అంతేకాక ప్రమాదవశాత్తు ఏదైనా పశువులుగాని, చిన్న జీవాలు గానీ మరణిస్తే పశుసంవర్ధక శాఖకు సంబంధించిన సచివాలయ పశుసంవర్ధక సహాయకులకు సమాచారం అందించాలని తెలియజేశారు. పిడుగులు పడే అవకాశం ఉన్నందున రైతులు చెట్ల కింద ఉండరాదని తెలిపారు.

## ఆధార్ క్యాంప్ని సద్వినియోగం చేసుకోండి

### ఎంఈఓ డాక్టర్ హేమమాలిని

**ప్రజాశక్తి - పిచ్చాటూరు :** పిచ్చాటూరు మండలంలో పిల్లలకు ఆధార్ లేనివారు ప్రతి ఒక్కరు పాఠశాలల్లో నిర్వహిస్తున్న ఆధార్ క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ డాక్టర్ హేమమాలిని కోరారు.